## 12 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 06: ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 12 నుంచి తరగతులను ప్రారంభించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి 7గంటల వరకు ప్రత్యేక బ్యాచ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 7989903001 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు గడువు పొడిగింపు

ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 8వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు.

### వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్, బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ సెమిస్టర్ పరీక్షా ఫలితాలతో పాటు దూరవిద్య ద్వారా అందించే పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ మేథమెటిక్స్, పీజీ డిప్లొమా ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ తదితర కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేశామని అధికారులు వెల్లడించారు.

### బీఎఫ్ఏ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని వివిధ బీఎఫ్ఏ కోర్సుల పరీక్షా ఫీజును అధికారులు స్వీకరించనున్నారు. బీఎఫ్ఏ (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్ అండ్ ఫొటోగ్రఫీ) కోర్సుల మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 18వ తేదీ లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చు.

### 'ఎంఏఎం' రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని ఎంఏఎం (ఐదేండ్ల కోర్సు) పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. మొదటి నుంచి ఆరో సెమిస్టర్ వరకు పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 16వ తేదీలోపు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవాలని కోరారు.

# లదాఖ్ టు కన్యాకుమారి

- సైక్లింగ్ వినియోగంపై ప్రచారం చేస్తూ 13 మంది 3800 కిలో మీటర్ల ప్రయాణం
- లదాఖ్ కార్గిల్ వార్ మెమోరియల్ నుంచి హైదరాబాద్
- నేడు నగరానికి చేరుకోనున్న హైదరాబాద్ సైక్లిస్టు బృందం
- మరో 13 వందల కిలో మీటర్లతో యాత్ర పూర్తి..
- 13 మంది రైడర్స్..ఇందులో ఇద్దరు మహిళలు
- ఆర్మీ అధికారుల ప్రోత్సాహం మరవలేనిదన్న హెచ్‌సీజీ ఫౌండర్ రవీందర్



సందడి చేస్తున్న సైక్లిస్టు బృందం

సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : లదాఖ్ టూ కన్యాకుమారి 3వేల 8 వందల కిలోమీటర్లు.. సైక్లింగ్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందనే నినాదాన్ని ఎత్తుకుని హైదరాబాద్‌కు చెందిన 13 మంది రైడర్స్ సాహసోపేతమైన 'సైక్లింగ్ రైడ్' చేస్తున్నారు. హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ఆధ్వర్యంలో నవంబర్ 21న లదాఖ్ కార్గిల్ వార్ మెమోరియల్ నుంచి 13 మంది సైక్లిస్టులు రైడ్ ప్రారంభించారు. ఇందులో ఇద్దరు మహిళా రైడర్లు ఉండటం విశేషం. ఇప్పటి వరకు 2500 కిలో మీటర్ల రైడ్ విజయవంతంగా పూర్తి చేశారు. గురువారం ఉదయం 6గంటలకు సైక్లింగ్ రైడ్ కొంపల్లిలోని డెక్లథాన్ వద్దకు చేరుకోనుంది. నగరం మీదుగా మళ్లీ 13 వందల కిలోమీటర్ల మేర సైక్లింగ్ రైడ్ సాగనుందని హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ఫౌండర్ నందనూరి రవీందర్ తెలిపారు. గమ్యస్థానం కన్యాకుమారి చేరుకున్నాక సైక్లింగ్ యాత్ర ముగియనుంది. అక్కడి నుంచి వారి వెంట ఉన్న ఎలక్ట్రిక్ సహాయక వాహనాల్లో తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు. ఈ సందర్భంగా రవీందర్ నమస్తే తెలంగాణతో మాట్లాడుతూ.. సైక్లింగ్ వినియోగం పెంచాల్సిన అవసరం ఉందని దేశానికి గుర్తు చేసేలా తాము సైక్లింగ్ రైడ్ ఎంచుకున్నామని తెలిపారు. ఆర్మీ అధికారులు తమ రైడ్‌కు అత్యంత ప్రాధాన్యతనిచ్చారని చెప్పారు. కార్గిల్‌లో తమ రైడ్ ప్రారంభానికి జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అధికారి సచిన్ మాలిక్, డిప్యూటీ జీఓసీ జైదీప్ చంద్ర, తదితర ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా వచ్చారని తెలిపారు. దేశంలో కాలుష్యకారక వాహనాల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని... సైక్లింగ్ రైడ్‌లతో అవగాహన కల్పించాలని జీఓసీ అధికారి సచిన్ మాలిక్ తమకు సందేశమిచ్చారని వివరించారు. సైక్లింగ్ వినియోగం ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అందుకు తగిన వసతులను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని ఆయన కోరారు.



సైక్లిస్టు బృందం

## భారతదేశ సుస్థిరతకు సైబర్ సెక్యూరిటీ కీలకం




కార్యక్రమంలో నిర్వాహకులతో కలిసి హాజరైన టీసీపీ వేవ్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ మురళీ సప్ప

కొండాపూర్, డిసెంబర్ 6 : సైబర్ సెక్యూరిటీ అనేది భారతదేశ వృద్ధికి, సుస్థిరతకు ఎంతో కీలకమని టీసీపీ వేవ్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ మురళీ సప్ప అన్నారు. మాదాపూర్ మైండ్ స్పేస్‌లోని ది వెస్టిన్‌లో బుధవారం సీటీవో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీసీపీ వేవ్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ మురళీ సప్ప విచ్చేసి నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ సెక్యూరిటీ భారతదేశ వృద్ధికి, సుస్థిరతకు ఎంతో కీలకమని, టీసీపీ వేవ్ పూర్తిగా డిజిటల్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. డీఎన్ఎస్ సెక్యూరిటీ తన సృజనాత్మక సెక్యూరిటీ సొల్యూషన్‌లతో ప్రస్తుత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో వ్యాపారాలు సజావుగా సాగేందుకు వీలు కల్పిస్తుందన్నారు. మన దేశంలో ఆర్థిక, వైద్య, ఐటీ, ఐటీఈఎస్, రిటైల్, ప్రభుత్వ రంగాలకు సైబర్ ముప్పు ఎక్కువగా ఉందన్నారు. ఈ పరిశ్రమలకు సైబర్ భద్రత కల్పించడంలో టీసీపీ వేవ్ ప్రత్యేకతను సాధించిందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ మార్కెట్ విస్తృతంగా పెరుగుతుందని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడంలో మా సంస్థ ముందుంటుందని, ఎప్పటికప్పుడు నూతన సమస్యలు వాటిల్లుతున్నాయని.. అదే సమయంలో ఈ రంగంలో నిపుణుల కొరత బాగా ఉందని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో హైదరాబాద్ ప్రమాణాలు ఎంతో బాగున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో 30 సంస్థలకు చెందిన సీఈఓలు, 40 మంది సైబర్ సెక్యూరిటీ నిపుణులు పాల్గొన్నారు.

## హెచ్‌పీఎస్‌లో గ్రాండ్ ఫినాలే ఉత్సవాలు




గ్రాండ్ ఫినాలే షెడ్యూల్‌ను ప్రకటిస్తున్న హెచ్‌పీఎస్ ప్రతినిధులు

బేగంపేట్, డిసెంబర్ 6 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రాండ్ ఫినాలే ఉత్సవాలను నిర్వహించనున్నట్లు హెచ్‌పీఎస్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ నెల 19న శతాబ్ది ఉత్సవాలు ప్రారంభించి, 24వ తేదీ నుంచి 27 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీ నోరియా తెలిపారు. అలాగే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

## స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలు భద్రం

**45 రోజుల తర్వాత ఐదేండ్ల పాటు ఎన్నికల సంఘం ఆధీనంలోకి..**

సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికలు సజావుగా ముగిసాయి. ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు ఎన్నికల క్రతువు ముగించారు. అయితే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేల్చిన ఈవీఎంలను మాత్రం పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూంలకు తరలించారు. ఈవీఎంలతో పాటు వీవీప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీ ప్యాట్లలోని స్లిప్పులు, మాక్‌పోల్ ధ్రువపత్రాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్, తదితర ఎన్నికల సామగ్రిని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయా రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి తాళాలు వేసి సీల్ వేశారు. ఈవీఎంల భద్రతకు ఎన్నికల సంఘం అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఎన్నికల ఫలితాలు వెల్లడించిన తర్వాత 45 రోజుల పాటు జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఈవీఎంలకు భద్రత కల్పిస్తారు. అనంతరం వాటిని ఎన్నికల సంఘానికి అప్పగించి గోదాంలకు చేర్చుతారు. ఆ తరువాత ఎన్నికల సంఘం నియమించిన ఇంజినీర్లు వచ్చి వాటిలోని డేటాను తొలగించి అవసరాన్ని బట్టి దేశంలో ఎక్కడైనా ఎన్నికలు జరిగితే అక్కడికి తీసుకెళ్లి ఉపయోగిస్తారు.

### ఐదేండ్ల సమయంలో అవి కీలకం..

అభ్యర్థుల మధ్య ఎన్నిక పోటాపోటీగా జరిగినప్పుడు గోదాంలలో భద్రపరిచిన ఈవీఎంల కంట్రోల్ యూనిట్లు కీలకమవుతాయి. అతి తక్కువ ఓట్లతో ఓడిపోయిన అభ్యర్థులు ఎప్పుడైనా ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానాలకు వెళ్లవచ్చు. అంతేకాదు ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత గెలిచిన అభ్యర్థిపై ఓడిపోయిన వారు ఎప్పుడైనా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఓట్ల లెక్కింపు సమయంలో ఏవైనా అవకతవకలు జరిగాయని సదరు అభ్యర్థులు భావించి న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థులకు న్యాయం చేయడానికి ఈవీఎంల కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానం ఆదేశించవచ్చు. అలాంటి సందర్భాల్లో ఇవి కీలకమవుతాయి. ఏ నియోజకవర్గంలో ఫిర్యాదు అందితే దానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్లలో ఓట్లను తక్షణమే లెక్కించడానికి వీలుగా అధికారులు ఈవీఎంలను భద్రపరిచారు.